
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 1 సెప్టెంబరు 2025



గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	3,41,558	3,05,551
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.80 (4.15)	6525.88	5927.77
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.9467 (41.1465)	2,41,575	3,03,289

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

పరిషత్ ఎన్నికలు ఈ నెలలోనే..

స్థానిక ఎన్నికల సమరానికి అడ్డంకులు ఒక్కోటి తొలగిపోతున్నాయి. హైకోర్టు విధించిన గడువు, ఈ నెలాఖరులోగా తొలుత పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామపంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రధానమైన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు బిల్లు ఆదివారం అసెంబ్లీ ఆమోదం పొందడం, ఇప్పటికే గవర్నర్ వద్దకు సైతం బిల్లు చేరడంతో నేడో, రేపో ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఈ వారంలోనే జీవో విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీవో విడుదల చేసిన వెంటనే వారంలోగా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ఎన్నికల సంఘం సిద్ధమైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)





- రెండోవారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే యోచన
- ఈ నెల10లోపు ఓటర్ల జాబితాలు సిద్ధం
- ఓటర్ల జాబితా సిద్ధమైన వారంలో రిజర్వేషన్ల ఖరారు
- రిజర్వేషన్లు తేలిన వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల కమిషన్ సన్నద్ధత

ఈ నెల 20వ తేదీలోగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని భావిస్తుండడంతో, ఈ నెల 10లోగా పరిషత్ ఎన్నికల నిమిత్తం ఓటర్ల జాబితాలు సిద్ధం చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. తొలుత పరిషత్ ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత వెనువెంటనే గ్రామపంచాయతీల ఎన్నికలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవడంతో ఒక్కసారిగా జిల్లాల్లోనూ ఎన్నికల సందడి మొదలైంది.

ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పరిషత్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఇప్పటికే సిద్ధమైంది. ఎంపీటీసీ స్థానాల పునర్విభజన ఇప్పటికే పూర్తిచేశారు. మరోవైపు ఎన్నికల పోలింగ్‌స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలు తయారుచేశారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించారు. పోలింగ్ బీఎల్‌వోలు (బూత్ లెవల్ ఆఫీసర్ల)కు శిక్షణ సైతం ముగిసింది. ప్రభుత్వం ఎప్పుడు షెడ్యూల్...

జిల్లా	జడ్పీ స్థానాలు	ఎంపీటీసీ స్థానాలు
నల్లగొండ	33	353
సూర్యాపేట	23	253
యాదాద్రి	17	178
మొత్తం	73	784

- మిగతా 8వ పేజీలో...

రిజర్వేషన్లపైనే ఆశావహుల ఎదురుచూపు

పరిషత్ ఎన్నికలు పార్టీల ప్రాతిపదికన జరగనుండడంతో పోటీకి ఉత్సాహం చూపుతోన్న స్థానిక నాయకులు రిజర్వేషన్ల కేటాయింపులకోసం ఎదురుచూస్తున్నారు. బీసీలకోటా పెరగడంతో మొత్తం రిజర్వేషన్లు 64 శాతం వరకు రానున్నాయి. కీలకమైన పరిషత్ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గాల్లో పట్టుకోసం అధికార, ప్రతిపక్ష నాయకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీల ప్రాతిపదికన జరిగే ఎన్నికలు కావడంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. రిజర్వేషన్లు ఖరారైన మరుక్షణం గ్రామాల్లో, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తే కదన రంగంలోకి దూకేందుకు అన్నిరకాలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఈ నెల 10లోగా ఓటర్ల జాబితాల ప్రకటనకు షెడ్యూల్

పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 10వ తేదీలోగా ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలు ఖరారు చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 6వ తేదీన ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయాల వద్ద ముసాయిదా ఓటర్ల జాబితాలు ప్రచురించాలని నిర్ణయించింది. ఈ నెల 8న జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు, విన్నపాలపై చర్చిస్తారు. అదేరోజు మండలాల్లోనూ మండల పరిషత్ అధికారుల నేతృత్వంలో, జిల్లా సహాయ ఎన్నికల అథారిటీల ఆధ్వర్యంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. 6వ తేదీ నుంచి 8వ తేదీవరకు అభ్యంతరాలు, సూచనలు, ఓటర్ల జాబితాలపై సలహాలను స్వీకరిస్తారు. అనంతరం 9వ తేదీన ఈ అభ్యంతరాలు, సూచనలు, విజ్ఞప్తులను పరిశీలిస్తారు. సెప్టెంబరు 10వ తేదీన పోలింగ్ కేంద్రాల వారీగా తుది ఓటర్ల జాబితాలను జిల్లా ఎన్నికల అధికారులు విడుదల చేస్తారు.

స్థానిక సమస్యలపై సమరం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి



ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన నియోకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లెలు, పట్టణాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో అధ్యయన యాత్రలు నిర్వహించినట్లు తెలిపారు. యాత్రలో పార్టీ దృష్టికి వచ్చిన అంశాల పరిష్కారంకోసం అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేడు మండల కేంద్రాల్లో, 2వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నాడు సాగించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ రాజకీయ లబ్ధికోసం వక్రీకరిస్తోందన్నారు. నాటి పోరాట వాస్తవాలను ప్రజలకు తెలియ జెప్పాల్సిన కర్తవ్యం కమ్యూనిస్టులపై ఉందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నాటి పోరాట యోధులను, వారి కుటుంబ సభ్యులను, సానుభూతిపరులను గుర్తించి సన్మానించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ కార్యదర్శి కార్యదర్శి డాక్టర్ మల్లుగౌతంరెడ్డి, మండల కార్యదర్శి రవినాయక్, వినోద్‌నాయక్, రెమిడాల పరుశరాములు, ఆయూబ్, యూటీఫ్ నాయకులు బక్క శ్రీనివాసాచారి, రాంరెడ్డి, కరీమున్నీసా, దయానంద్, రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పక్కా రహదారిని వెంటనే నిర్మించాలి

- **సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి**



ఉట్కూరు- బండమీదిగూడెం గ్రామాల మధ్య వర్షానికి ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న తుమ్మల వీరారెడ్డి

శాలిగౌరారం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఊట్కూరు నుంచి బండమీది గూడెం వరకు తారు రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆందోళన డిమాండ్ చేశారు. శాలిగౌరారం మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల అధ్యయన కార్యక్రమంలో భాగంగా ఆదివారం శాలిగౌరారం మండలం ఊట్కూరు నుంచి బండమీది గూడెం వెళ్లే ప్రధాన రహదారిని పరిశీలించారు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందని, రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా మంత్రి ఎవరూ పట్టించుకోలేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఈ రోడ్డుకు సంబంధించి నిధులు మంజూరు చేసి పక్కా రోడ్డు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, మండల నాయకులు మక్క బుచ్చి రాములు, డెంకల లింగయ్య, గుండ్లపల్లి వెంకన్న, కిరణ్, సత్యనారాయణ, నర్సింహ, సత్తయ్య పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తు పత్తి రైతు చిత్తు!



నార్కట్‌పల్లి మండలంలో పత్తి చేలో పత్తిమొక్కలతో పాటు పెరిగిన గడ్డి

ప్రకృతి విపత్తు పత్తి రైతును చిత్తు చేసేలా మారింది. అతివృష్టి.. అనావృష్టి.. పత్తి సాగుపై ప్రభావం చూపనుంది. కురవాల్సిన సమయంలో కురవని వర్షాలు... తెరిపియాల్సిన సమయంలో ఎడతెరిపి లేకుండా పడిన వానలు వెరసి పత్తి రైతును కుదేలు చేస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ, నార్కట్‌పల్లి)

- పత్తిసాగుపై అతివృష్టి, అనావృష్టి ప్రభావం
- చేలో పత్తితోపాటు పెరుగుతున్న గడ్డి
- రెండింతల పెట్టుబడి.. వచ్చేనా దిగుబడి..?
- ఆందోళనలో పత్తి సాగు చేసే రైతులు

ఆకులు ఎర్రగా మారాయి



నేను 20 ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో సుమారు 10 ఎకరాల చేలో నీరు నిలిచి ఆకులు ఎర్రగా మారాయి. గడ్డికూడా విపరీతంగా పెరిగింది. దీంతో ఆకుమచ్చలు పోగొట్టే మందు పిచికారీతోపాటు గడ్డి తొలగింపునకు మందు కొట్టాల్సి వచ్చింది. కాలం సహకరించక ఎకరానికి అన్ని విధాలా కలిపి 20,000 అదనపు ఖర్చు చొప్పున రూ.2,00,000 అవుతోంది.

- మచ్చ లింగయ్య, రైతు, చెర్వుగట్టు

రోహిణి కార్తెలో నాటిన విత్తనాలు తీవ్రమైన వర్షాభావంతో మొలకెత్తలేదు. దీంతో కొందరు రైతులు రెండు, మూడో పర్యాయం కూడా విత్తనాలు నాటాల్సి వచ్చింది. ఫలితంగా పంట పెట్టుబడి రెండింతలు పెరిగింది. పోనీ మూడుసార్లు నాటినా పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్న దశలో ఎడతెరిపి లేకుండా పడిన వానలు మొక్కలకు అదును సమయంలో ఎరువులను అందించలేకుండా చేశాయి. ఈ కారణంగా చేలో పత్తితోపాటు గడ్డి పెరుగుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే కొందరి రైతుల చేలో పత్తి మొక్కలకన్నా ఎక్కువగా గడ్డిమొక్కలే పెరిగాయంటే అతిశయోక్తి కాదు. ఇది చాలదన్నట్లు పత్తి మొక్కల ఆకులు కూడా వర్షం నీళ్ల నిలిచిన కారణంగా ఎర్రగా మారి పత్తి పంట దిగుబడిపై ప్రభావం చూపుతాయనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

70,769 ఎకరాల్లో పత్తిసాగు

నకిరేకల్ నియోజకవర్గంలో రామన్నపేట మండలాన్ని మినహాయిస్తే ఈ సీజన్‌లో మొత్తం 70,769 ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేశారు. వీటిలో వరుసగా చిట్యాల మండలంలో 24,884 ఎకరాలు, కట్టంగూర్‌లో 10,770 ఎకరాలు, కేతేపల్లిలో 6506 ఎకరాలు, నకిరేకల్‌లో 6159 ఎకరాలు, నార్కట్‌పల్లిలో 22,450 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ప్రకృతి విపత్తుల కారణంగా దాదాపు 30 శాతం పత్తిసాగు భూముల్లో రైతులు రెండు సార్లు విత్తనాలు నాటినట్లు తెలుస్తుంది.

ఎకరాకు రూ.20,000 అదనపు ఖర్చు

రోహిణి కార్తెలో వర్షాలు కురవని కారణంగా విత్తనాలు మొలకెత్తక రైతులు రెండో పర్యాయం..

- మిగతా 8వ పేజీలో...

నల్లగొండ నియోజకవర్గంలో..

నల్లగొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ నియోజకవర్గంలో 30,501 ఎకరాల్లో పత్తి సాగైంది. జూన్, జూలైలో సమృద్ధిగా వర్షాలు కురవకున్నప్పటికీ ఆగస్టు నెలలో కురిసిన వర్షాలతో పత్తి విస్తీర్ణం పెరిగింది. ఆలస్యంగా సాగైనప్పటికీ పత్తి దిగుబడులు బాగానే వస్తాయని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం పత్తి చేలు గూడ దశలో ఉన్నాయి. కనగల్ మండలంలో 7వేలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు కాగా, నల్లగొండ మండలంలో 18వేల ఎకరాలపైగా సాగైంది. ఇక తిప్పర్తి మండలంలో 5వేల ఎకరాలలోపు పత్తిసాగు చేశారు. ఇటీవల వర్షాలు అడపాదడపా కురుస్తుండడంతో యూరియా అవసరం పెరిగింది. అయితే యూరియా కొరత తీవ్రంగా ఉండటంతో రైతులు అరకొరగా ఎరువులు వేసే పరిస్థితి నెలకొంది. పత్తి చేలు ఏపుగా పెరిగాయి. గూడదశలో ఉన్న పత్తి చేలో గూడ రాలకుండా ఉండేందుకు మందులు పిచికారీ చేస్తున్నారు. పత్తి చేలు ఆలస్యంగా సాగైనప్పటికీ దిగుబడి బాగానే వస్తుందని భావిస్తున్న రైతులు ఎరువులు సమృద్ధిగా వేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎరువుల కొరత రైతులను ఆందోళన గురిచేస్తుంది. రెండుమూడు రోజుల్లో యూరియా వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పింఛన్లు పెంచేవరకు పోరాటం ఆగదు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

నల్లగొండ టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పింఛన్ల విషయంలో ప్రభుత్వ ఇచిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఎస్బీఐ ఫంక్షన్ హాల్ లో జరిగిన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పింఛన్లను పెంచుతామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి పింఛన్‌దారులను మోసం చేశాడని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టి దాదాపు 20 నెలలు గడుస్తున్నా పింఛన్ పెంపు విషయం చర్చకు రాపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి పింఛన్ పెంచకుండా పింఛన్‌దారులను ద్రోహం చేస్తుంటే... ప్రతిపక్ష పార్టీలు నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవత్ రెడ్డి బంగ్లాలో పుట్టి వచ్చినాడని, కేసీఆర్ గడీల నుంచి వచ్చిన నాయకులు అయినందునే పింఛన్‌దారుల పక్షాన నిలబడడం లేదని అన్నారు. పింఛన్లు పెంచే వరకు పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. సెప్టెంబరు 3 హైదరాబాదులో జరిగే పింఛన్‌దారుల మహాగర్జనకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ నేత గడ్డం ఖాసిం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరిక శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు లక్ష్మమ్మ, ఇంద్రచౌదరి, అహమ్మద్‌ఖాన్, సైదులు ఉన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద



చండంపేట మండలం పోలేపల్లిలో గ్రంథాలయం ప్రారంభించి మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద

చందంపేట/చింతపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. చందంపేట మండలం పోలేపల్లి గ్రామ యువకులు ఒక బృందంగా ఏర్పడి నిరుపయోగంగా ఉన్న పాత గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గ్రంథాలయంగా మార్చారు. ఆదివారం ఆ గ్రంథాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ నంద మాట్లాడుతూ ఆధునిక కాలంలో యువకులు మొబైల్ ఫోన్‌లే కాకుండా, గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవాలని, గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రంథాలయాల ఏర్పాటు చేయాలనే ఆలోచన పోలేపల్లి యువతకు రావడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో ప్రతీ గ్రామంలో గ్రంథాలయాల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని కోరారు. గ్రంథాలయాలు అన్ని వయస్సుల వారికి ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, నాగిళ్ల జున్ను ఇద్దయ్య, కొమ్ము ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, అర్జున్‌కుమార్, కిరణ్‌కుమార్, ఉమామహేశ్వర్, రమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తూ మార్గమధ్యలో చింతపల్లిలో సాయిసన్నిధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి సాయిసన్నిధి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జడ్జీ కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం పలికారు.

పీఎస్ హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

- **రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ గౌడ్**

నల్లగొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన పీఎస్ హెచ్‌ఎంల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హెచ్‌ఎంలకు రావాల్సిన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను సాధించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డి.వెంకటరత్నం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎండీ.జాన్‌ఖాన్, ప్రధానకార్యదర్శి నామని శ్రీనయ్య, కోశాధికారిగా మదర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. అనంతరం పీఎస్ హెచ్‌ఎంగా ఎన్నికైన వెంకటరత్నం ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పీఎస్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



లడ్డూ ప్రసాదంతో ద్రోణయ్య దంపతులు

రూ.3లక్షలు పలికిన లడ్డూ

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): విఘ్నాలు తొలగించే వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని వైదేహి టౌన్ షిప్‌లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి ప్రసాదానికి వేలం జరిగింది. స్వామికి సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని కాలనీవాసి, గ్రీన్ బకెట్ బిర్యానీ దుకాణ నిర్వాహకుడు కోట్ల ద్రోణయ్య వేలంలో రూ.3 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వింజం శ్రీధర్, పుట్ట కమలాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బొగ్గారావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



లక్కీడ్రా విజేతకు 'బంగారు' వినాయకుడు

● మిర్యాలగూడ పట్టణంలో తులం బంగారంతో సిద్ధంచేసిన ఉత్సవ కమిటీ

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ లోని రెడ్డికాలనీలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో లక్కీ డ్రా విజేతలకు బంగారు వినాయక విగ్రహాన్ని అందించనున్నారు. రెడ్డి కాలనీలో ఏటేటా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కాలనీవాసులందరూ ఉత్సాహంతో పాల్గొంటారు. ఈ ఏడాది రూ.516 టికెట్‌తో లక్కీ డ్రా తీసి, డ్రాలో గెలుపొందిన భక్తుడికి 24క్యారెట్లతో తయారుచేసిన తులం బంగారు గణపతిని అందివ్వనున్నారు. ప్రతి ఏటా వినాయక లడ్డూకు వేలం పాట వేసేవారమని, భక్తుల ఆసక్తికి అనుగుణంగా ఈ ఏడాది తులం బంగారంతో వినాయక ప్రతిమను తయారు చేయించి డ్రా తీయనున్నట్లు కృష్ణపట్నం ఫ్యామిలీ రెస్టారెంట్ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



ప్రకృతి విఘ్నాలు.. తొలగించేలా..

▸▸ వినాయకుడి పూజలకు ఉపయోగించిన పత్రి, పండ్లతో విత్తనాల తయారీ

▸▸ పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించిన గాంధీనగర్ యూత్



విత్తన తయారీ కోసం వినాయక చవితి పూజలకు ఉపయోగించిన పండ్లు సేకరిస్తున్న సందీప్

వనజీవి రామయ్య స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులేస్తున్నారు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ యువకులు. గాంధీనగర్ యూత్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికుడు అవిరెండ్ల సందీప్ మిత్రులతో కలిసి విత్తన సేకరణ చేపట్టాడు. నాలుగేళ్లలో సందీప్ మిత్రబృందం 9 లక్షల విత్తనాలు సేకరించింది. ఏటేటా లక్షలాది విత్తనాలను సేకరిస్తున్న మిత్రులు సరికొత్త ఆలోచనలతో విత్తన సేకరణ, మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్

వినాయక చవితి సందర్భంగా పూజలకు వినియోగించే పత్రి, పండ్లతో విత్తనాలను తయారు చేసేందుకు చర్యలు చేపట్టారీ యువకులు. విఘ్నాలు తొలగించే వినాయకుడికి సమర్పించే వెలగ, మారేడు, నేరేడు, దానిమ్మ, మొక్కజొన్న, సీతాఫల తదితర పండ్లను సేకరించి ఎండబెట్టి విత్తనాలు తయారు చేస్తున్నారు. దైవానుగ్రహంతో పాటు ప్రకృతి మెప్పు పొందే దిశగా చర్యలు చేపట్టిన యువకులను పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు, ప్రేమికులు అభినందిస్తున్నారు.

లక్ష్యంతోనే లక్షల విత్తనాలు..

పర్యావరణాన్ని పరిరక్షించాలని, మొక్కలు నాటాలని తలుచుకుంటే విత్తనాలకు కొదవే లేదంటున్నారు సందీప్. మొక్కలు పంచుతారని ఎదురు చూడొద్దని, మనం రోజు తిరిగే దారుల్లో, సేద తీరే చెట్ల కిందే గానుగ, వేప, అల్బిజియా, నేరేడు, చింత, మర్రి, రాగి, సీతాఫల, మామిడి విత్తనాలు లభ్యమవుతాయని తెలిపారు. ఆయా విత్తనాలను సేకరించి రహదారుల వెంట, ఖాళీ ప్రదేశాలు, అడవుల్లో చల్లితే సత్ఫలితాలు సాధించవచ్చని పేర్కొంటున్నారు.

ప్రకృతి ప్రసాదించిన పండ్లతో విత్తనాల తయారీ



ప్రకృతి ప్రసాదించిన పండ్లతోనే విత్తనాలను తయారు చేస్తున్నాం. వినాయక చవితి సందర్భంగా దేవుడికి సమర్పించిన పండ్లను నిమజ్జనం అనంతరం సేకరిస్తున్నాం. ఆయా పండ్లను ఎండబెట్టి విత్తనాలు తయారు చేసి చల్లుతాం. ప్రకృతిని రక్షించేందుకు అందరూ ముందుకు కదలాలి. పెరుగుతున్న భూతాపం మానవాళితో పాటు సమస్త జీవరాశులపై ప్రభావం చూపుతోంది. ప్రకృతిని రక్షించుకోవాలంటే పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరముంది.

\- అవిరెండ్ల సందీప్‌కుమార్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ.

నిమజ్జన మట్టిలో మొక్క నాటాలి



మట్టి గణపతులతో వినాయక చవితి పండుగ జరుపుకోవడం గొప్ప విషయం. మట్టి విగ్రహాలతో ఉత్సవాలు జరుపుకున్న భక్తులు నిమజ్జన సమయంలో ఆ మట్టిలో మొక్క నాటి సంరక్షించాలి. భారీ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించిన ఉత్సవ కమిటీ సభ్యులు తలా ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సాయమందించాలి. ఇలా చేస్తే భగవంతుని మెప్పు పొందడంతో పాటు ప్రకృతిని పూజించినట్లవుతుంది. ఇదే ఆనవాయితీ ప్రతి ఏటా కొనసాగిస్తూ పట్టణ భక్తులు ఇతర మునిసిపాలిటీలకు ఆదర్శం కావాలి.

\- గుణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

చెరువు మట్టి వెంచర్లకు

● యథేచ్ఛగా తరలుతున్న మట్టి.. పట్టించుకోని అధికారులు



ఎక్స్‌కవేటర్‌తో చెరువు మట్టి తవ్వుతున్న దృశ్యం

నల్లగొండ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా అన్నెపర్తి గ్రామ శివారులోని చెరువు మట్టి యథేచ్ఛగా తరలుతోంది. దీంతో రోజు రోజుకు భూగర్భజాలాలు అడుగంటుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్ల కోసం రైతులు వందల అడుగుల లోతుల్లో బోర్లు వేసినా ఫలితం లేకుండా పోతోంది. ఒక పక్క ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు, చెరువుల కుంటను నింపేందుకు ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు మట్టి తవ్వి వెంచర్లలో తరలిస్తున్నారు.

ప్రశ్నిస్తే దాడులు..

మట్టి తరలింపుపై ఎవరైనా వారిని ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



ట్రాక్టర్ల ద్వారా తరలుతున్న చెరువు మట్టి

నల్లగొండ మండలంలోని అన్నెపర్తి గ్రామానికి చెందిన కొంతమంది అన్నెపర్తి, ఇతర గ్రామాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అన్నెపర్తి గ్రామ శివారులోని చెరువులో ఎక్సకవేటర్ల ద్వారా పెద్దఎత్తున మట్టి తవ్వి వెంచర్లకు, గ్రామాల్లో ఇంటి నిర్మాణాలకు తరలిస్తున్నారు. మూడు నెలలుగా ప్రతిరోజూ సుమారు 20కి పైగా ట్రాక్టర్ల ద్వారా తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని జిల్లా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ విషయమై మండల ఇరిగేషన్ అధికారి మేఘానను వివరణ కోరగా, చెరువులో తవ్వకాలు జరుగుతున్నట్లు ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని తెలిపారు.

మతిస్థిమితం లేక బావిలోకి దూకి..

మోత్కూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాసగాని సరిత(35) సుమారు ఏడాదిగా మానసిక స్థితి బాగాలేదు. రోజు మాదిరిగానే ఆదివారం తెల్లవారు జామునే లేచి వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. కొంతసేపటికి భర్త వెంకన్న బావి వద్దకు వెళ్లే సరికి అక్కడ ఆమె కన్పించలేదు. వ్యవసాయ క్షేత్రంలో ఎక్కడా కనిపించకపోవడంతో బావిలోకి చూడగా అందులో సరిత శవమై తేలింది. అతను వెంటనే గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. సరిత తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సరితకు భర్త, కుమారుడు, కూతురు ఉంది.



సరిత(ఫైల్)

ఆరు వేల కిలోల బెల్లం సీజ్

కొండమల్లేపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, బీదర్ నుంచి నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రాంతానికి అక్రమంగా తరలిపోతున్న నల్లబెల్లాన్ని దేవరకొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. డీసీఎం వ్యాన్‌లో దేవరకొండ ప్రాంతానికి తరలిస్తుండగా కొండమల్లేపల్లి మండలం చెన్నారం ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం పట్టుకున్నారు. 6వేల కిలోల బెల్లం, 300 కిలోల పటిక, డీసీఎం వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్. శ్రీనివాస్, ఎస్‌ఐ నరసింహ తెలిపారు. మొత్తంగా బెల్లం, వాహనంతో కలిపి రూ.10లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలో కానిస్టేబుల్ శేఖర్, నాగరాజు, అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా బెల్లం వాహనాన్ని పట్టుకోవడంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను నల్లగొండ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు.



బెల్లం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పాన్ బ్రోకర్ ఆటకట్టించి..

మోత్కూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మోసం చేసేందుకు ప్రయత్నించిన పాన్ బ్రోకర్ ఆగడాలను డిఫెన్స్ వినియోగదారుల సంఘం ఆటకట్టించింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డిఫెన్సు వినియోగదారుల సంఘం అధ్యక్షుడు గుమిడెల్లి పరశురామ్, బాధితుడు ఏసోబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలుకు చెందిన పూర్ణగంటి ఏసోబు కొంతకాలంగా మోత్కూరులో కూలిగా పనిచేస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం ఏసోబు మోత్కూరులోని వెంకటేశ్వర పాన్ బ్రోకర్స్ జ్యువెల్లర్స్ యజమాని రాజు వద్ద 11తులాల వెండి పట్టా గొలుసులు కుదువపెట్టి 2025 మే 12వ తేదీన రూ.4 వేల అప్పు తీసుకున్నాడు. వడ్డీ రూ.3. ఈ నెల 22న ఏసోబు పాన్‌బ్రోకర్స్ దుకాణానికి వెళ్లి వడ్డీతో డబ్బులు చెల్లిస్తాను పట్టగొలుసులు ఇవ్వాలని కోరాడు. ఈరోజు డబ్బులు చెల్లించి రేపు గొలుసులు తీసుకెళ్లాలని దుకాణం యజమాని చెప్పాడు. అందుకు ఏసోబు అంగీకరించకుండా రోజూ అతని దుకాణం చుట్టూ తిరిగాడు. ఈ నెల 30న మీ గొలుసులు పొరపాటున వేరే వ్యక్తికి ఇచ్చాను.. మీరు కుదువబెట్టిన వెండి గొలుసుల్లో తరుగు తీసివేస్తే ఎనిమిది తులాలు వెండి వస్తుంది తీసుకెళ్లాలని చెప్పడంతో అవాక్కైన ఏసోబు ఈ విషయాన్ని డిఫెన్స్ వినియోగదారుల సంఘం దృష్టికి తీసుకెళ్లాడు. అతని దుకాణం వద్దకు వెళ్లి నిలదీయడంతో దుకాణం యజమాని రాజు డబ్బులు తీసుకుని బాధితుడు ఏసోబుకు 11 తులాల వెండి పట్ట గొలుసులు ఇచ్చాడు. దీంతో వివాదం సద్దుమణిగింది.

పశువుల తొట్టిలో శిశువు

మునగాల, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన శిశువును నీళ్లు లేని పశువుల తొట్టిలో వదిలేశారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం తిమ్మారెడ్డి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మారెడ్డి గ్రామంలో గ్రామీణ వైద్యురాలు ఇంటి పరిసర ప్రాంతాల్లో నీళ్లలేని పశువుల తొట్టిలో పుట్టిన శిశువు లభ్యమైందని గ్రామస్థులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి శిశువును గుర్తించారు. సూర్యాపేట ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి శిశువును తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది అందుబాటులో లేక పోవటంతో పోలీస్ సిబ్బందే శిశువును చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామన్నారు. ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

● పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

తిప్పర్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందనే మనస్తాపంతో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని జొన్నగడ్డలగూడెం గ్రామానికి చెందిన నర్సింగ్ రవి(42)కు 16 సంవత్సరాల క్రితం రజితతో వివాహం జరిగింది. వీరికి సంతానంగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివాహం జరిగిన మూడు సంవత్సరాల నుంచి భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే కారణంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరిగేవి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో చెప్పినా మార్పు రాలేదు. ఆదివారం ఉదయం 9గంటల సమయంలో ఇంట్లోనే భార్యభర్తలు గొడవ పడ్డారు. అనంతరం భార్య ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. తన భార్య ఎంత చెప్పినా మారడం లేదని మనస్తాపంతో ఇంట్లోనే ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో నల్లగొండలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మధ్యాహ్న సమయంలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రవి తల్లి నర్సింగ్ సువార్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి. శంకర్ తెలిపారు.

విద్యుత్ స్తంభం కూల్చివేత

● విద్యుత్ సరఫరా కావొద్దని రైతు దుశ్చర్య

నూతనకల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తన పొలం నుంచి మరో రైతుకు విద్యుత్ సరఫరా వెళ్లొద్దని మరో రైతు విద్యుత్ స్థంభాన్ని కూల్చాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో ఆదివారం జరిగింది. బాధిత రైతు కొండ్ర లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తన బోరుకు విద్యుత్ సరఫరా కోసం తన పక్క రైతు కొండ్ర చంద్రమౌళి భూమిలో నుంచి లైన్ వేశారు. దీంతో తన భూమిలో నుంచి లైన్ పోనివ్వనని రైతు స్తంభాన్ని కూల్చి వేశాడు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.



పొలంలో కూలిన విద్యుత్ స్తంభం

50 ఏళ్ల ఉత్సవం.. 50 కిలోల లడ్డూ



గణేష్ మార్కెట్‌లో పూజలందుకుంటున్న కాగితపు గుజ్జు గణనాథుడు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలకు కేంద్రబిందువు మిర్యాలగూడ పట్టణంలోని గణేష్ మార్కెట్. 50వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ప్రత్యేకతతో కూడుకున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది ఏర్పాటు చేసిన 16 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తిగా కాగితపు గుజ్జుతో తయారు చేయించారు. ప్రసాదపు లడ్డూను 50వ వార్షికోత్సవం సందర్భంగా 50 కిలోలతో నిర్వాహకులే తయారు చేయించారు. ప్రతి ఏటా దాతలు సమర్పించే ప్రసాద లడ్డూను ఈ సారి లక్కీ డ్రా ద్వారా విజేతకు అందించనున్నారు. అందుకు రూ.516 టికెట్‌గా నిర్ణయించగా భక్తులు పెద్దఎత్తున డ్రాలో పాల్గొంటున్నారు. లక్కీ డ్రా తీసి గెలుపొందిన భక్తుడికి లడ్డూ అందించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నవరాత్రుల అనంతరం విగ్రహ నిమజ్జన కార్యక్రమానికి రూ.2.50లక్షలతో ప్రత్యేక రథం తయారు చేయించారు.

'ఆల్ ఇన్ వన్ ఫ్యామిలీ'

మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని విశాల్ మార్ట్ పక్క నుంచి విద్యానగర్‌కు వెళ్లే కూడలిలో ఆల్ ఇన్ వన్ ఫ్యామిలీ నినాదంతో గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 7వ వార్షికోత్సవంతో భాగంగా 16 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రూ.20ల నోట్లతో గణనాథునికి దండ వేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అందంగా అలంకరించిన మండపంలో ప్రతిష్ఠించిన భారీ విగ్రహాన్ని దర్శించుకునేందుకు పట్టణ, పరిసర ప్రాంత భక్తులు వందలాదిగా తరలివస్తున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



హౌసింగ్ బోర్డు కాలనీలోని విద్యానగర్‌లో పూజలు అందుకుంటున్న 16 అడుగుల భారీ విగ్రహం

'దాపు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, గుత్తా అమిత్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రకృతితో మమేకమై జీవన తాత్వికతను తన కవిత్వంలో నేర్పుగా ఆవిష్కరించిన కవి మునాస వెంకట్ అని ఎమ్మెల్సీ గోరటి వెంకట్ అన్నారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం శాసనమండలి చైర్మన్ క్యాంప్ కార్యాలయ ఆవరణలో కవి మునాస వెంకట్ రచించిన 'దాపు' కవితా సంపుటి పుస్తకాన్ని తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బెల్లి యాదయ్య, అంబటి సురేంద్రరాజు, గుంటూరు లక్ష్మి నరసయ్య, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సిద్దార్థ, భైరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, పెరమాళ్ల ఆనంద్, అంబటి వెంకన్న, మేరెడ్డి యాదగిరిరెడ్డి, భూతం ముత్యాలు, నాగేందర్, సాగర్ల సత్తయ్య, కస్తూరి ప్రభాకర్, బండారు శంకర్ పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు

● అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ఏనుబాముల గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కలకోట్ల శ్రీను(47)కు ఆదివారం స్వగ్రామం ఏనుబాములలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాకు చెందిన సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు సిబ్బందితో వచ్చి గౌరవ వందనం సమర్పించారు. జాతీయ జెండాతో పాటు అతని దుస్తులు, బ్యాడ్జీతో పాటు రూ.75వేల నగదును శ్రీను భార్య మంజులకు అంత్యక్రియల సమయంలో సీఆర్‌పీఎఫ్ సీఐ చౌహాన్ అందజేశారు. అనంతరం గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి నివాళులర్పించారు. ఈ అంత్యక్రియల్లో సైనికుల సంక్షేమ అసోసియేషన్ మాజీ నాయకులు ఎల్‌ఎల్ నాయక్, మాదయ్య, సోమయ్య, నాగయ్య, జానిమియా, చంద్రయ్య, సూర్యాపేట మాజీ జడ్పీటీసీ జీడీ బిక్షం, సురేందర్, జనార్ధన్, గురువయ్య, మీరా, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీను మృతదేహానికి నివాళులర్పిస్తున్న అధికారులు (ఇన్‌సెట్లో ఫైల్‌ఫోటో)



గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగిరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

» నాపై 181 కేసులు బనాయించారు
» ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
» చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
» 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
» 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాల తోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా.. సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

» 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
» 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
» కేరళలో పాంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సావానికి హాజరు



విద్యార్థినికి పాంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పాంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.


ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్ష పాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ప్రయాణానికి రాజమార్గం

» ఫాస్టాగ్ సందేహాల నివృత్తికి రాజ్‌మార్గ్ యాత్ర యాప్
» వాహనదారులు సులువుగా గమ్య స్థానం చేరుకునేందుకు తోడ్పాటు



సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు వాహనదారులు సులువుగా గమ్య స్థానం చేరుకునేందుకు రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ యాప్‌తో ప్రయాణం సులబతరం కానుంది. రవాణాతోనే ముడిపడి ఉన్న రవాణామార్గాలకు, సాధనాలకు ఈ యాప్ తోడ్పాటునందిస్తుంది.

- (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

నేషనల్ హైవేస్ ఆథారిటీ ఆధ్వర్యంలో రూ పొందించిన రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌తో వాహనదారులకు ఉపయోగాలెన్నో ఉన్నాయి. దేశంలోని హైవేల్లో, సమీపంలో ఉన్న టోల్ ప్లాజాలు, పెట్రోల్ బంకులు, ఆస్పత్రులు, హోటళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, పోలీస్‌స్టేషన్ల ఎక్కడ ఉన్నాయనే సమాచారాన్ని స్పష్టంగా తెలుసుకోవచ్చు.

ఒక్క యాప్.. సేవలు ఎన్నో

రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో వాహనదారుల ప్రయాణానికి అవసరమైన సమాచారమంతా ఉంటుంది. ఏ మార్గంలో వెళ్తే గమ్యానికి త్వరగా చేరొచ్చు,తక్కువ దూరం,తక్కువ టోల్ గేట్లు ఎక్కడున్నాయనే సమాచారాన్ని అందిస్తుంది. లైవ్ ట్రాఫిక్ వివరాలు అందించడంతో పాటు వాతావరణ పరిస్థితులు,హెచ్చరికలు తెలుసుకోవచ్చు.

ఫిర్యాదులు చేసే అవకాశం

జాతీయ రహదారులపై పెరుగుతున్న వాహనల సంఖ్యతో పాటే ఫిర్యాదులు పెరుగుతున్నా యి. నేషనల్ హైవేల్లో కలిగిన ఇబ్బందులను (రోడ్లపై గుంతలు, స్పీడ్ బ్రేకర్లుండటం, అవసరమైన చోట సూచన బోర్డులు లేకపోవడం తదిత ర అంశాలు) ఈయాప్‌లో నమోదు చేస్తే ఎన్‌హెచ్ఏతో పాటు ప్రభుత్వం స్పందిస్తుంది.

హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అందుబాటులో

రాజ్‌మార్గ్ యాత్ర సేవలు ప్రస్తుతం హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనే అందుబాటులో ఉండగా, ఇత ర ప్రాంతీయ భాషల్లో అందుబాటులోకి తేనుంది ఎన్‌హెచ్ఏఐ. తెలుగు, కన్నడ, మరాఠ, తమిళ భాషలలో రాజ్‌మార్గ్ యాత్ర యాప్ అందుబాటులోకి రానుంది.


టోల్‌పాస్ వినియోగదారులకు...

కేంద్రప్రభుత్వం టోల్‌పాస్ వినియోగదారుల కోసం ప్రవేశపెట్టిన నూతన పథకంతో వాహనదారులకు కొంత అయోమయానికి గురవుతున్నారు. రూ.3వేలు చెల్లించి పాస్ పొందితే.. సదరు పాస్‌తో దేశంలోని అన్ని టోల్‌గేట్ల వద్ద టోల్ చెల్లించనక్కర లేదని వినియోగదారులు అనుకుంటున్నారు. అయితే సదరు పథకం జాతీయ రహదారులపై ఉండే టోల్ గేట్లకే వర్తిస్తుంది. రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌గేట్ల ను దాటాలంటే ఫీజు చెల్లించాల్సిందే. ఓఆర్ఆర్‌పైన ఉంటే టోల్‌గేట్ల వద్ద బిల్లు వర్తిస్తుంది.

యాన్యువల్ టోల్ పాస్‌పై సందేహాలు

జాతీయ,రాష్ట్ర రహదారుల విషయంలో అందరికీ అయోమయం ఉంది. నేషనల్ హైవే ఏదో, స్టేట్‌రోడ్ ఏదో తెలియక టోల్ గేట్ల వద్ద ఇబ్బంది పడుతున్నారు. ఆయా ఇబ్బందులకు రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌తో తెలుసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ యాప్ స్టోర్‌ల ద్వారా రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఉపయోగకరంగా రాజ్ మార్గ్ యాత్ర యాప్



ప్రభుత్వం రూపొందించిన రాజ్‌మార్గ్ యాత్ర యాప్ చాలా ఉపయోగకరంగా ఉంది. నేషనల్ హైవేలపై సొంత వా హనాల్లో ప్రయాణించే వారికి ఈ యాప్ సహాయకారిగా ఉంటుంది. పెట్రోల్ బంక్, హాస్పటల్, హోటల్.. ఇలా ఎక్కడ ఏది ఉందో తెలియజేస్తుంది. సురక్షిత డ్రైవింగ్, వేగ పరిమితి హెచ్చరికలు చేస్తుంది. రహదారుల భద్రత తదితర అంశాలపై యాప్‌లో పిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తుంది.

- వెంపటి అజయ్‌కుమార్, విద్యావేత్త సూర్యాపేట

ప్రభుత్వ యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజా సేవలను సులభతరం చేసేందుకు ప్రభుత్వాలు ఆధునిక సాంకేతికతతో కూడిన యాప్‌లను రూపొందించాయి. రోడ్డు రవాణా, వాహనదారుల సమస్యలు, మ్యాప్స్ తదితర అంశాలతో కూడిన రాజ్‌మార్గ్ యాత్ర, వాహన్ తదితర యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. కాలక్షేపం కోసం కాకుండా అవసరాలకు ఉపయోగపడే, ప్రభుత్వం రూపొందించిన యాప్‌ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- రాజశేఖరరాజు, మిర్యాలగూడ డీఎస్పీ.

రెండు క్లిక్కులతో..

యాప్‌లో పొందుపరిచినయాన్యువల్ టోల్ పాస్‌పై క్లిక్ చేసి, ఎలిజిబుల్ టోల్ ప్లాజాస్ అనే అంశంపై క్లిక్ చేస్తే కనిపించే టోల్ గేట్లకు మాత్రమే యాన్యువల్ టోల్ పాస్ పనిచేస్తుంది. అక్కడ చూపని టోల్ ప్లాజాలపై యాన్యువల్ టోల్ పాస్ పని చేయదని గుర్తుంచుకోవాలి. అంటే నేషనల్ హైవే ఆథారిటీలోని రహదారుల్లో ఏర్పాటు చేసిన టోల్‌గేట్లకు మాత్రమే యాన్యువల్ టోల్ పాస్ వర్తిస్తుందని, రాష్ట్ర రహదారుల(అంటే నార్కెట్‌పల్లి - అద్దంకి రహదారి)పై యాన్యువల్ టోల్ పాస్ పని చేయదు. ఆయా రోడ్లపై ఉన్న ప్లాజాల వద్ద టోల్ డబ్బులు చెల్లించాల్సిందే.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఎత్తివేత

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు చెక్‌పోస్టులు



డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కోదాడరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 18 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కోదాడకు సమీపంలోని నల్లబండగూడెం, మిర్యాలగూడెం సమీపంలో దామరచర్ల మండలం వాడపల్లి వద్ద, నాగార్జున సాగర్‌లో చెక్‌పోస్టును ఏర్పాటుచేశారు. ఈ మూడు చెక్‌పోస్టులతో ప్రభుత్వానికి రోజుకు రూ.10లక్షలకు పైగా ఆదాయం వచ్చేదని అధికారులు తెలిపారు. ఈ చెక్‌పోస్టులతో ఇప్పటి వరకు వాహనదారులు పొందుతున్న సేవలు టెంపరరీ, పర్మినెంట్, స్పెషల్ పర్మినెంట్ వలంటరీ ట్యాక్స్ ఈ మూడు చెక్ పోస్టుల వద్ద డబ్బులు చెల్లించి రాష్ట్రంలోకి ప్రవేశిస్తారు. ఇక నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని అంతర్రాష్ట్ర పరంగా ఎక్కడైనా ప్రయాణించవచ్చని నల్లబండగూడెం చెక్‌పోస్టు ఇన్‌చార్జి రాజ్‌మహ్మద్ తెలిపారు. ఆన్‌లైన్‌లో ట్యాక్స్ చెల్లించే విధానంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును ఒకటి, రెండు రోజుల్లో ఎత్తివేయనున్నట్లు ఆయన తెలిపారు.

యాద'గిరి'పై'గరుడ' సేవలు

యాదగిరిగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తుల కోసం గరుడ ట్రస్టు పేరుతో పథకం నూతనంగా ప్రవేశపెట్టారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అతిథి గృహంలో దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్ చేతుల మీదుగా ఈనెల ఆగస్టు 29వ తేదీన ప్రారంభించారు. ఈ మేరకు 30వ తేదీన పథకానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించారు. ఈ పథకానికి సంబంధించి బ్యాంకు ఖాతా తెరచి వచ్చిన విరాళాలతో విద్య, వైద్య, ప్రసాదవితరణ నిర్వాహణకు వినియోగిస్తారు. భక్తులకు వసతి, దర్శన కూపన్లు ఇచ్చి సదుపాయాలతో పాటు బాండ్లు అందజేస్తారు. ఈమేరకు విరాళాలు అందించిన వారికి అందనున్న సేవలను ఈవో ఎస్. వెంకట్రావు వివరించారు.

● రూ.2లక్షలు చెల్లించిన భక్తులకు రూ.300కు సబంధించిన బ్రేక్ దర్శనం ఆరుగురు భక్తులకు ఏడాదిలో మూడు పర్యాయాలు, రూ. 150 టికెట్టు భక్తులకు 8 పర్యాయాలు జీవితకాలం సదుపాయం ఉంటుంది.



గరుడ ట్రస్ట్ సేవల వివరాల లోగో

కాగా, ఈ పథకంలో చేరిన భక్తులకు కొండ కింద యాద రుషి నిలయంలో రెండు పడకల గది కేటాయిస్తారు. ఇంకా మొదటి సారి స్వామి వారి అభిషేకం లడ్డు ప్రసాదం, శేష వస్త్రం, కనుము బహూకరిస్తారు.

● రూ. లక్ష చెల్లించిన రూ. 300 బ్రేక్ దర్శనం ఆరుగురు భక్తులకు నాలుగు పర్యాయాలు, రూ. 150 టికెట్టు పొందిన ఆరుగురు భక్తులకు 4 పర్యాయాలు జీవితకాలం దర్శన సదుపాయం కల్పిస్తారు. విరాళం అందజేసిన తొలి విడత స్వామి లడ్డు ప్రసాదం, శేషవస్త్రం, కనుము అందజేస్తారు.

● రూ. 50వేలు చెల్లించిన రూ. 300 బ్రేక్ దర్శనం ఆరుగురు భక్తులకు రెండు పర్యాయాలు, రూ.150 టికెట్టు దర్శనం ఆరుగురు భక్తులకు రెండు పర్యాయాలు జీవితకాలం సదుపాయం ఉంటుంది. విరాళం చెల్లించిన మొదటి సారి స్వామి అభిషేకం లడ్డు ప్రసాదం, శేష వస్త్రం, కనుము బహూకరిస్తారు.

యాదగిరికొండపై భక్తుల సందడి



యాదగిరిగుట్ట కొండపై ఉచిత దర్శనం క్యూకాంప్లెక్స్‌లో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్య క్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఉభయ క్యూలైన్లు, ఆలయ తిరువీధులు భక్తులతో రద్దీగా కనిపించాయి. సుమారు 20 వేల మంది భక్తులు తరలిరాగా ఉచిత దర్శన క్యూ కాంప్లెక్స్, ప్రత్యేక, ధర్మదర్శనం క్యూలైన్లల్లో భక్తులతో ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం (ఆరగింపు) సమయాల్లో మూడు గంటల పాటు ఉభయ క్యూలైన్లల్లో భక్తుల వేచి ఉన్నారు. ప్రత్యేక దర్శనానికి అరగంట, ఉచిత దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద మధ్యాహ్నం వరకు రద్దీ ఉండగా తర్వాత భక్తులు స్వల్పంగా కనిపించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 25,96,211 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా కొండపై హరిహరులకు నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి.

టీజీజేఏసీ ధర్నాను విజయవంతం చేయాలి

నల్లగొండ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

దేవాలయ భూములను పరిరక్షించాలి

చిట్యాలరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ పరిధిలో శ్రీతిరుమలనాథస్వామి దేవాలయ భూముల పరిరక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చేకూరి గణేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేవాలయానికి సంబంధించిన భూములు కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ వేకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. భూముల పరిరక్షణకోసం కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్షను చేయనున్నట్లు తెలిపారు.

ప్రకృతి విపత్తు... పత్తి రైతు చిత్తు !



రెట్టింపైన ఖర్చులు

చౌటుప్పల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సాగు నీటి వనరులు లేని మునుగోడు నియోజకవర్గంలో రైతాంగం ఎక్కువగా పత్తి సాగు చేస్తోంది. ఇటీవల జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసినా, మునుగోడు నియోజకవర్గంలో సాధారణ వర్షపాతమే నమోదైంది. ఈ సీజన్ లో నియోజకవర్గంలోని చౌటుప్పల్ మండలంలో 10,500 ఎకరాలు, సంస్థాన్‌నారాయణపురం మండలంలో 28వేల ఎకరాలు, మర్రిగూడెం మండలంలో 35వేల ఎకరాలు, మునుగోడు మండలంలో 39,657 ఎకరాలు, గట్టుప్పల మండలంలో 13,140ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగుచేశారు. ఈ సీజన్ ప్రారంభంలో తేలికపాటి వర్షాలు పడడంతో కొంతమంది రైతులు పత్తి సాగుచేశారు. తర్వాత సకాలంలో వర్షాలు పడకపోవడంతో ముందుగా సాగుచేసిన వంటలు వాడిపోయాయి. దీంతో ముందుగా సాగుచేస్తున్న రైతులు రెండోసారి మళ్లీ విత్తనాలను పెట్టాల్సిన పరిస్థితి. దీంతో రైతులకు పెట్టుబడి సాధారణంకన్నా రెండింతలు పెరిగింది. అసలే కరువు కోరల్లో ఉన్న ఈ ప్రాంతంలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో రైతులకు వివర నష్టం వాటిల్లింది. అంతటా జోరు వానలు కురిసినప్పటికీ మునుగోడులో మాత్రం సాధారణ వర్షపాతం కురిసింది. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. వరుసగా కురిసిన ముసురు వానలతో కొన్ని గ్రామాల్లో పత్తిచేలలో నీళ్లు నిలిచాయి.

(5వ పేజీ తరువాయి)

విత్తనాలు నాటారు. అవి కూడా మొలకెత్తకుంటే కొందరు మూడో పర్యాయం కూడా విత్తాల్సి వచ్చింది. పర్యవసానంగా విత్తన ప్యాకెట్లు, కూలీల డబ్బులు, కలుపు తీత, గడ్డిమందు వంటి వాటికోసం ఒక ఎకరాకు అదనంగా రైతుకు సుమారు రూ.20,000 అదనపు భారం పడింది.



ఈ సారి 100 క్వింటాళ్లు కష్టమే

నేను 19 ఎకరాల్లో గత సీజన్‌లో పత్తి సాగు చేశా. సుమారు 160 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. కానీ ఈసారి విచిత్ర పరిస్థితులెదుర్కోవాల్సి వచ్చింది. అయితే అతివృష్టి లేదంటే అనావృష్టి అనే చందంగా ప్రకృతి ప్రకోపించింది. రోహిణిలో పత్తి విత్తనాలు నాటితే మొలకెత్తలేదు. మళ్లీ నాటాను అయినా మొలకెత్తలేదు. మూడో సారి నాటాను మొలకెత్తి పత్తిచేలు ఎదిగే దశలో ఎడతెరపి లేని వర్షాలతో భారీగా గడ్డి పెరిగింది. మూడు పర్యాయాలు ఇలా విత్తనాలు నాటడం, కూలీలతో గడ్డికోత, యూరియా తదితరాలకు అదనపు పెట్టుబడి భారం పడింది. పైగా సకాలంలో మొక్కలు పెరగక ఈ పర్యాయం దిగుబడి కనీసం 100 క్వింటాళ్ల దిగుబడైనా వస్తుందానేది అనుమానమే.

రేగట్టె రవీందర్‌రెడ్డి, రైతు, చెర్వుగట్టు

అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



తిప్పర్తిలో సమస్యలపై మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

తిప్పర్తి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని తిప్పర్తి మాజీ జడ్పీటీసీ ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల అధ్యయన పాదయాత్ర ఆదివారం నాలుగోరోజు తిప్పర్తి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిప్పర్తిలో గతంలో దళితులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, వాటికి సరైన దారిలేక ఎవరూ వెళ్లకపోవడంతో తిరిగి ప్రభుత్వమే స్వాధీనం చేసుకుందని తెలిపారు. వెంటనే పేదలకు ఇళ్లు మంజూరు చేసి అన్ని వసతులు ఉన్న చోట డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు పూర్తి చేసి అర్హులైన వారికి పంపిణీ చేయాలని కోరారు. మండల కేంద్రంలో మూత్రశాలలు నిర్మించాలని తెలిపారు. ప్రజా సమస్యలపై సెప్టెంబరు 1వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాదయాత్ర బృందం సభ్యులు నన్నూరి వెంకట్‌రమణారెడ్డి, మండల కార్యదర్శి మన్నెం భిక్షం, నాయకులు రాములు, వెంకన్న, జంజిరాల సైదులు, శశిధర్, ఉమ, మంత్రాల మంగమ్మ, శివ ప్రసాద్, శరత్, యూన్సీ, నవీన్, రాజేష్, అచ్యుత్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ ప్రహరీకి విరాళం

నార్కట్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు దళిత కాలనీ వద్ద ఉన్న గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి గుడి ప్రహరీ నిర్మాణానికి మాజీ ఎంపీపీ రేగట్టె నర్సింహారెడ్డి రూ.70వేల విరాళాన్ని ప్రకటించారు. కాలనీలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రక్షణ లేక ముత్యాలమ్మ గుడి పరిసరాలు అపరిశుభ్రంగా మారిన సమస్యను స్వయంగా పరిశీలించిన రేగట్టె నర్సింహారెడ్డి గుడి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమ్మంపాటి వెంకటయ్య, దొడ్డి నర్సింహ, గౌరీదేవి నర్సింహ, బాలెం బిక్షం, గాదరి రాంబాబు, వంపు శివ, కరుణాకర్‌రెడ్డి, నరేష్, లింగయ్య, యాదయ్య, నర్సింహ, శ్రీను పాల్గొన్నారు.

నాయకులు, ఆశాల అరెస్ట్ సరికాదు

మర్రిగూడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఐటీయూ మండల నాయకులు, ఆశా కార్యకర్తలను అరెస్టు చేయడం సరైనది కాదని, ప్రభుత్వ అక్రమ అరెస్టులతో నిర్బంధాలతో పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య హెచ్చరించారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆందోళనకు వెళ్లే ఆశాలు, సీఐటీయూ నాయకులను ఆదివారం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా గ్రామాల్లోని పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తున్న ఆశాలను ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమని అన్నారు. చలో కమిషనర్ కార్యాలయ ముట్టడి చేపట్టి సమస్యలను ప్రభుత్వానికి చెప్పాలనుకుంటే అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు సల్యోజు రామలింగాచారి, మట్టం భాగ్యమ్మ, జంపాల వసంత, ఏర్పుల పద్మ, లపంగి దుర్గమ్మ, లపంగి సబిత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

● డీఎస్పీ కె. శివరాంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ● గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పలు చోట్ల అన్నదానం, హోమాలు



విద్యానగర్‌లో మట్టిగణపతికి పూజల్లో పాల్గొన్న డీఎస్పీ శివరారంరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్ తదితరులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : గణనాథుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆనందకరమైన జీవనాన్ని గడపాలని డీఎస్పీ కె. శివరాంరెడ్డి అన్నారు. ఆదివారం 47వ వార్డు విద్యానగర్ పార్కులో ఏర్పాటు చేసిన మట్టి గణపతి వద్ద మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం శుభ పరిణామమన్నారు. అనంతరం సుమారు రెండువేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్, ఎస్ఐలు ఎర్ర సైదులు, సైదాబాబా, మాజీ డీసీసీ అధ్యక్షుడు సుంకరి మల్లేష్ గౌడ్, కమిటీ సభ్యులు పంతులు శ్రీనివాస్, బి. వీరారెడ్డి, చక్రపాణి, వెంకటేశ్వర్లు, అంజయ్య, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ మనోహర్, శ్రీరాములు, నరహరి, పద్మావతి, చకిలం సంధ్యారాణి, గోవిందమ్మ, లీలావతి, సావిత్రమ్మ, రజిని, లలిత, తుమ్మల పద్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

న్యూ తిరుమల నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో....

పట్టణంలోని 33వ వార్డు న్యూ తిరుమలనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, న్యూ తిరుమలనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండారు యాదగిరితో పాటు రేగట్టె లింగస్వామి, పెసర నవీన్‌రెడ్డి, వడ్డే దేవేందర్‌రెడ్డి, మాసంశెట్టి ప్రవీణ్ కుమార్, దేవిశెట్టి వెంకటేశ్వర్లు, దామోదర్ రెడ్డి, ఉప్పల శ్రీధర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, అలుగుబెల్లి మధుసూదరెడ్డి, బండ మధుసూదన్‌రెడ్డి, పొట్ట బత్తులరామ్ తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ కల్చరల్ : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు మండపాల్లో హోమాలు, అన్నదానం నిర్వహిస్తున్నారు. కొందరు వినాయకులను ఆనందోత్సవాల మధ్య, వాయిద్యాలతో కోలహాలంగా సాగింది. వల్లభరావు చెరువు వద్ద నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను చేశారు.

● చిట్యాలరూరల్ : మండలంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా అన్న ప్రసాద వితరణలు చేస్తున్నారు. ఉరుమడ్లలో రాయల్‌కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి ప్రతిమ వద్ద ఆఫ్ లివింగ్ శిక్షకుడు, గ్రామస్తుడు పల్లపు బుద్దుడు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో కోనేటి యాదగిరి, పోలగోని స్వామి, పట్ల జనార్ధన్, జనపాల శ్రీను, కురుపటి లింగయ్య, శ్రీను, దినేష్, రమేష్, ఎల్లయ్య, శ్రీను, లక్ష్మయ్య, కుమార్, యాదయ్య, కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

● కేతేపల్లి: మండలంలోని భీమారంలో లాల్‌సలాం యూత్ ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఆదివారం స్థానిక యువకులు, వివిధ పార్టీల నాయకులు పూజలు నిర్వహించారు. ఆయా అన్నదాన కార్యక్రమాల్లో చీకటిగూడెం మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, చీకటిగూడెం, మాజీ ఎంపీటీసీ కోట సరిత, భీమారం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, మండపాల నిర్వహకులు బడుగుల నరేందర్‌యాదవ్, కె.బ్రహ్మాచారి, కోట పూర్ణచందర్‌రావు, వడ్డె రామారావు, ఎ.వెంకన్న, ఎం.నర్సయ్య, బి.మహేష్, కీసరి నాగరాజు, మహేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ శ్రీరాంనగర్‌కాలనీలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ..

అమరవీరులను స్మరించుకోవాలి : బీజేపీ



చిట్యాలరూరల్ : గుండ్రాంపల్లిలో పాల్గొన్న నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు

చిట్యాలరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రజాకార్ల పాలన నుంచి ప్రజలకు విముక్తిని కల్పించేందుకు ఎందరో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించి అమరులైయ్యారని, అమరవీరులను సంస్మరించుకోవడం మనందరి బాధ్యత అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీబాత్ కార్యాక్రమాన్ని వీక్షించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణలో ప్రజలకు ఆనంతోషం లేక నిజాం, రజాకారుల పాలనతో పడరాని పాట్లు పడ్డారని గుర్తుచేశారు. బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన నిర్వహించనున్న సంస్మరణ సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న అధ్యక్షతన సమావేశంలో కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్, నూకల వెంకట నారాయణరెడ్డి, మండల వెంకన్న, నర్సింహ, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లేష్‌గౌడ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌ను అందుకుంటున్న మల్లేష్‌గౌడ్

నల్లగొండ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): యువజన విభాగం, సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసినందుకు చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన సుంకరి మల్లేష్‌గౌడ్‌కు గౌరవ డాక్టరేట్ వరించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీ సెర్చ్ యూనివర్సిటీ ద్వారా ఆయనకు డాక్టరేట్‌తో సత్కరించింది. సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ అక్కుల రమేష్, సహ వ్యవస్థాపకుడు అడ్వకేట్ ధ్యాన్ మోర్గాన్ ఖైట్ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 30న జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్‌న ప్రదానం చేశారు. మల్లేష్‌గౌడ్ సుంకరి ఫౌండేషన్ నెలకొల్పి కొన్నేళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా సుదీర్ఘకాలం పనిచేయడమే కాకుండా జిల్లా కేంద్రంలో పేరుపొందిన న్యాయవాదులలో ఒకరిగా ఉన్నారు. ప్రస్తుతం చిట్యాల పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

కుమ్మరుల హక్కుల సాధన కోసం ఏకమవ్వాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కుమ్మరుల హక్కులను సాధించుకోవటం కోసం కుమ్మరులంతా ఏకం కావాలని ఐక్యం కావాలని సంఘాన్ని బలోపేతం చేయాలని తెలంగాణ కుమ్మర సంఘం (టీఆర్‌కేఎస్) రాష్ట్ర కార్యదర్శి రాధారపు బిక్షపతి పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కుమ్మర సంఘం మండల, పట్టణ నూతన కమిటీల ఎన్నికకు ఆయన హాజరై మాట్లాడారు. రాజకీయంగా బలపడేందుకు ఐక్యంగా నడవాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా కుమ్మర సంఘం నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడిగా నిమ్మనగోటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా మాసంపల్లి సైదులు మరో 15 మందితో కమిటీని ఎన్నుకున్నారు. అదేవిధంగా నార్కట్‌పల్లి పట్టణ కుమ్మర సంఘం నూతన అధ్యక్షుడిగా రాధారపు దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా మిడిదొడ్డి నాగరాజు 15 మందితో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌కేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధరి వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవసలహాదారు నిమ్మనగోటి లింగయ్య, నాయకులు తాడూరు చంద్రం, కంభంపాటి సతీశ్, రాధారపు రమేశ్, బొడ్డుపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

'జాబితా ప్రదర్శించని అధికారులపై చర్యలు తీసుకోవాలి'

కేతేపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వద్ద ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించకుండా నిర్లక్ష్యంగా వ్యహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని చీకటిగూడెం గ్రామ మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు కోరారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ముసాయిదా ఓటరు జాబితాలో తప్పొప్పులను గుర్తించి సవరణలను సూచించేందుకు వీలుగా ఆగస్టు 30వ తేదీన అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ముసాయిదా ఓటరు జాబితాలను ప్రదర్శించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. తమ గ్రామంలో ఓటరు జాబితాను ప్రదర్శించలేదని అన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులు

కనగల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కనగల్ కేజీబీవీ ఎస్ఎస్‌సీ 2015-16 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కనగల్ ఎక్స్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. చాలాకాలం తర్వాత ఒకే వేదిక మీద కలుసుకోవటంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయింది. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సమావేశానికి ఆహ్వానించి శాలువాలు కప్పి సత్కరించారు. కేజీబీవీ ఎస్‌వో స్వప్న, ఉపాధ్యాయులు మంజుల, ప్రజ్వల, యూన్సీ, రాణి, రమా, ధనమ్మ, వనిత, నాగలక్ష్మి, సునీత, సంతోష పూర్వ విద్యార్థులు మహేశ్వరి, భార్గవి, వరలక్ష్మి, సౌజన్య, అంజలి, రేణుక, గౌతమి, సంతోష, మౌనిక పాల్గొన్నారు

వాసవీభవన్‌లో ఘనంగా లక్ష్మీగణపతి హోమం



యజ్ఞదేవుడికి పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నార్కట్‌పల్లిలోని వాసవీ భవన్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ గణపతి హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతోనిర్వహించారు. సుమారు 15 మంది దంపతులు హోమగుండం వద్ద పూజల్లో కూర్చున్నారు. యాజ్ఞికుడు గుండేపూడి జానకిరామశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, నాయకులు మునుకుంట్ల గణేష్, వడ్డెగోని రామలింగం, ఆర్యవైశ్యులు పొల్వాయి భాస్కర్‌రావు, బిల్లకంటి శ్రీకాంత్, ఇడుకుళ్ల బిక్షమయ్య, పసునూరి శ్రీనివాస్, సంపత్, స్వాతి పాల్గొన్నారు.

● సన్‌షైన్ కాలనీలో: నార్కట్‌పల్లిలోని సన్‌షైన్ కాలనీలోని మట్టి గణపతి విగ్రహం వద్ద జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కొప్పు రాము, రఘురాంమూర్తి, నాగేంద్రప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, కశ్యప్, రవికుమార్, సుభాష్, లింగస్వామి, కార్తీక్, శివ, శ్రీకాంత్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణలు చెప్పాలి



నల్లగొండలో రాహుల్‌గాంధీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

నల్లగొండటౌన్, చిట్యాలరూరల్, తిప్పర్తి, మర్రిగూడ, చండూరు, నల్లగొండ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఓటు చోరీ యాత్ర పేరుతో దేశ ప్రధాని నరేంద్రమోదీ, అతని తల్లిపై ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలను, ఫ్లెక్సీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తూ దొంగ పాదయాత్ర చేస్తున్న రాహుల్‌గాంధీ యాత్ర విఫలం కావటంతో ప్రధాని మోదీపై అక్కసుతో ఆయన తల్లినీ అవమానపరిచేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ సంస్కృతీ, సంప్రదాయాలను గౌరవించని కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వాన్ని వమర్శించడమే లక్ష్యంగా పెట్టుకుందని దుయ్యబట్టారు. దేశం కోసం అహర్నిశలు శ్రమించే కొడుకును కన్న తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ ఆలోచనను మార్చుకోకపోతే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని, తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతరం రాహుల్ దిష్టిబొమ్మలు, ఫ్లెక్సీలను దహనం చేశారు.

● దేశ ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలను రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశంలో మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ ఇచ్చి దేశానికి మహిళా రాష్ట్రపతిని చేసి, ఆపరేషన్ సిందూర్‌తో దేశ రక్షణలో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ సుస్థిరపాలన అందిస్తున్న నరేంద్రమోదీపై అక్కసుతో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ, బీజేపీ జిల్లా నాయకులు లకడపురం వెంకటేశ్వర్లు, బుచ్చల నాగరాజు, చాముకురి మహేష్, బోడిగే భరత్, బాసాని కార్తీక్, కటకం మహేష్, లోహిత్ రెడ్డి, రాఘవ, బిల్లా నాయక్, వెంకట్ రెడ్డి, రవి, జానయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు

● దేశానికి గొప్ప నాయకుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీని అందించిన ప్రధాని తల్లి హీరాబెన్‌ను అవమానించిన రాహుల్‌గాంధీ దేశ మహిళలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, నూకల వెంకటనారాయణరెడ్డి, మండల వెంకన్న, విద్యాసాగర్‌రెడ్డి, లింగస్వామి, నర్సింహ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● తిప్పర్తిలో మండల అధ్యక్షుడు వంగూరి రవి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండా వినయ్‌కుమార్, నకిరేకంటి మహేష్, నల్లబోతు రమేష్, పగిడోజు బ్రహ్మాచారి, బొల్లెపల్లి, సైదులు, శ్రీనివాస్, శివశంకర్, లింగప్రసాద్, సందీప్, నగేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడ చౌరస్తాలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి యాస అమరేందర్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ పిట్టల శ్రీను ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నారని విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల అక్రమ అరెస్టులు చేసిన భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేందర్, నాయకులు వేనేపల్లి శ్రీనివాసరావు, పందుల రాములుగౌడ్, లింగస్వామి, గోపాల్, లింగయ్య, యాదగిరి, చాపల వెంకట్ తదితరులు పాల్గొన్నారు


● చండూరులో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ ఆధ్వర్యంలో దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమం లో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపర్తి యాదగిరి, నాయకులు భూతరాజు శ్రీహరి, పేర్ల గణేష్, బోడ ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీధర్, స్వామి, దోటి శివ, శంకర్, ఓంకారం పాల్గొన్నారు.

● నల్లగొండ బీజేపీ మండల అధ్యక్షుడు బోగరి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు చేసిన వారిలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకన్న, నాయకులు వెంకన్న, శంకర్, వెంకన్న పాల్గొన్నారు.



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో..

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 1 సెప్టెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	3,41,558	3,05,551
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.80 (4.15)	6525.88	5927.77
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.9467 (41.1465)	2,41,575	3,03,289

చికెన్ ధరలు | లైవ్: రూ.125 | డ్రెస్: రూ.190 | స్కిన్‌లెస్: రూ.220

పరిషత్ ఎన్నికలు ఈ నెలలోనే..

స్థానిక ఎన్నికల సమరానికి అడ్డంకులు ఒక్కోటి తొలగిపోతున్నాయి. హైకోర్టు విధించిన గడువు, ఈ నెలాఖరులోగా తొలుత పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామపంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రధానమైన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు బిల్లు ఆదివారం అసెంబ్లీ ఆమోదం పొందడం, ఇప్పటికే గవర్నర్ వద్దకు సైతం బిల్లు చేరడంతో నేడో, రేపో ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఈ వారంలోనే జీవో విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీవో విడుదల చేసిన వెంటనే వారంలోగా రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ఎన్నికల సంఘం సిద్ధమైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)





- రెండోవారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే యోచన
- ఈ నెల10లోపు ఓటర్ల జాబితాలు సిద్ధం
- ఓటర్ల జాబితా సిద్ధమైన వారంలో రిజర్వేషన్ల ఖరారు
- రిజర్వేషన్లు తేలిన వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల కమిషన్ సన్నద్ధత

ఈ నెల 20వ తేదీలోగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని భావిస్తుండడంతో, ఈ నెల 10లోగా పరిషత్ ఎన్నికల నిమిత్తం ఓటర్ల జాబితాలు సిద్ధం చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. తొలుత పరిషత్ ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత వెనువెంటనే గ్రామపంచాయతీల ఎన్నికలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవడంతో ఒక్కసారిగా జిల్లాల్లోనూ ఎన్నికల సందడి మొదలైంది.

ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పరిషత్ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఇప్పటికే సిద్ధమైంది. ఎంపీటీసీ స్థానాల పునర్విభజన ఇప్పటికే పూర్తిచేశారు. మరోవైపు ఎన్నికల పోలింగ్‌స్టేషన్ల వారీగా ఓటర్ల జాబితాలు తయారుచేశారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించారు. పోలింగ్ బీఎల్‌వోలు (బూత్ లెవల్ ఆఫీసర్ల)కు శిక్షణ సైతం ముగిసింది. ప్రభుత్వం ఎప్పుడు షెడ్యూల్...

- మిగతా 8వ పేజీలో...

జిల్లా	జడ్పీ స్థానాలు	ఎంపీటీసీ స్థానాలు
నల్లగొండ	33	353
సూర్యాపేట	23	253
యాదాద్రి	17	178
మొత్తం	73	784

రిజర్వేషన్లపైనే ఆశావహుల ఎదురుచూపు

పరిషత్ ఎన్నికలు పార్టీల ప్రాతిపదికన జరగనుండడంతో పోటీకి ఉత్సాహం చూపుతోన్న స్థానిక నాయకులు రిజర్వేషన్ల కేటాయింపులకోసం ఎదురుచూస్తున్నారు. బీసీలకోటా పెరగడంతో మొత్తం రిజర్వేషన్లు 64 శాతం వరకు రానున్నాయి. కీలకమైన పరిషత్ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గాల్లో పట్టుకోసం అధికార, ప్రతిపక్ష నాయకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీల ప్రాతిపదికన జరిగే ఎన్నికలు కావడంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. రిజర్వేషన్లు ఖరారైన మరుక్షణం గ్రామాల్లో, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తే కదన రంగంలోకి దూకేందుకు అన్నిరకాలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఈ నెల 10లోగా ఓటర్ల జాబితాల ప్రకటనకు షెడ్యూల్

పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 10వ తేదీలోగా ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాలు ఖరారు చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 6వ తేదీన ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయాల వద్ద ముసాయిదా ఓటర్ల జాబితాలు ప్రచురించాలని నిర్ణయించింది. ఈ నెల 8న జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు, విన్నపాలపై చర్చిస్తారు. అదేరోజు మండలాల్లోనూ మండల పరిషత్ అధికారుల నేతృత్వంలో, జిల్లా సహాయ ఎన్నికల అథారిటీల ఆధ్వర్యంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. 6వ తేదీ నుంచి 8వ తేదీవరకు అభ్యంతరాలు, సూచనలు, ఓటర్ల జాబితాలపై సలహాలను స్వీకరిస్తారు. అనంతరం 9వ తేదీన ఈ అభ్యంతరాలు, సూచనలు, విజ్ఞప్తులను పరిశీలిస్తారు. సెప్టెంబరు 10వ తేదీన పోలింగ్ కేంద్రాల వారీగా తుది ఓటర్ల జాబితాలను జిల్లా ఎన్నికల అధికారులు విడుదల చేస్తారు.

స్థానిక సమస్యలపై సమరం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి



ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన నియోకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లెలు, పట్టణాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో అధ్యయన యాత్రలు నిర్వహించినట్లు తెలిపారు. యాత్రలో పార్టీ దృష్టికి వచ్చిన అంశాల పరిష్కారంకోసం అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేడు మండల కేంద్రాల్లో, 2వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నాడు సాగించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ రాజకీయ లబ్ధికోసం వక్రీకరిస్తోందన్నారు. నాటి పోరాట వాస్తవాలను ప్రజలకు తెలియ జెప్పాల్సిన కర్తవ్యం కమ్యూనిస్టులపై ఉందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.నాటి పోరాట యోధులను, వారి కుటుంబ సభ్యులను, సానుభూతిపరులను గుర్తించి సన్మానించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ కార్యదర్శి కార్యదర్శి డాక్టర్ మల్లుగౌతంరెడ్డి, మండల కార్యదర్శి రవినాయక్, వినోద్‌నాయక్, రెమిడాల పరుశరాములు, ఆయూబ్, యూటీఫ్ నాయకులు బక్క శ్రీనివాసాచారీ, రాంరెడ్డి, కరీమున్నీసా, దయానంద్, రమణారెడ్డి, లక్ష్మినారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పక్కా రోడ్డును వెంటనే నిర్మించాలి


- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



ఉట్కూరు- బండమీదిగూడెం గ్రామాల మధ్య వర్షానికి ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న తుమ్మల వీరారెడ్డి

శాలిగౌరారం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఊట్కూరు నుంచి బండమీది గూడెం వరకు తారు రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆందోళన డిమాండ్ చేశారు. శాలిగౌరారం మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల అధ్యయన కార్యక్రమంలో భాగంగా ఆదివారం శాలిగౌరారం మండలం ఊట్కూరు నుంచి బండమీది గూడెం వెళ్లే ప్రధాన రహదారిని పరిశీలించారు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందని, రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా మంత్రి ఎవరూ పట్టించుకోలేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఈ రోడ్డుకు సంబంధించి నిధులు మంజూరు చేసి పక్కా రోడ్డు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, మండల నాయకులు మక్క బుచ్చి రాములు, డెంకల లింగయ్య, గుండ్లపల్లి వెంకన్న, కిరణ్, సత్యనారాయణ, నర్సింహ, సత్తయ్య పాల్గొన్నారు.

పత్తి రైతు దిగాలు



దామరచర్ల మండలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎదగని పత్తి చేను

జూన్ మొదటివారంలో తొలకరి మురిపించినా జూలై నెలలో వర్షాభావ పరిస్థితులు పత్తి రైతులను కంటతడి పెట్టించాయి. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా పత్తి మొక్కలో ఆశించినంత ఎదుగుదల లేదని రైతులు వాపోతున్నారు. పత్తి విత్తనాలు మొలకెత్తిన తర్వాత జూలైలో ఓ మోస్తరు వర్షాలైనా కురవకపోవడంతో పత్తి మొక్కలు వాడేదశకు చేరాయి. ఎండలు అధికంగా ఉండడంతో భూమిలో తేమ తగ్గి మొక్కలు వాడిపోతున్నాయి. అప్పుడప్పుడు కురిసిన చిరుజల్లులకు పత్తి మొక్కలు బతికినా ఎదుగుదల లోపించిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ, దేవరకొండ,హాలియా)

- సీజన్ ప్రారంభంలో వర్షాభావం
- తడిలేక ఎదగని పత్తి మొక్క
- వర్షం కురిసినా దిగుబడి కష్టమే

మిర్యాలగూడ నియోజకవర్గంలో గతేడాది 17 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈ సీజన్‌లో 13 వేల ఎకరాల్లో మాత్రమే రైతులు పత్తిని సాగుచేశారు. ఆగస్టు నెలలో వర్షాలు రైతులను భయపెట్టినా భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టులో మొత్తంగా 11 రోజులపాటు కురిసిన వర్షం 241.6 మి.మీ.లుగా నమోదైంది. గత ఏడాది ఆగస్టు నెలలో 200 మి.మీటర్ల వర్షం కురవగా గతేడాదితో పోలిస్తే ఆగస్టులో 41.6 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగా నమోదైంది. వర్షాలు కురియడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ పూత దశకు చేరుకోవాల్సిన పత్తి మొక్కలు ఎదుగుదల లేక కొమ్మలు విస్తరించక పోవడంతో పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం వుందని పత్తి రైతులు వాపోతున్నారు. అధిక మోతాదులో ఎరువులు వినియోగించినా ఆశించిన రీతిలో పత్తి మొక్క ఎదగడం లేదని అన్నదాతలు ఆక్రోషిస్తున్నారు. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పత్తిపై ప్రభావం లేదు



ఈ సీజన్‌లో హాలియా డివిజన్ పరిధిలో అధిక వర్షాల ప్రభావం ఇప్పటి వరకు పత్తి పంటపై పడలేదు. చీడపీడలు ఆశిస్తే వ్యవసాయాధికారుల సూచనలు మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. తిరిగి వర్షాలు వస్తే మడికట్లలో నిల్వ ఉన్న నీటిని తీసివేయాలి. కావాల్సిన యూరియాను అందబాటులో ఉంచడానికి కృషి చేస్తున్నాం.

- ఎమ్.సరిత, ఏడీఏ

దేవరకొండ నియోజకవర్గంలో...

దేవరకొండ నియోజకవర్గంలో 1.20లక్షల ఎకరాల వరకు రైతులు పత్తిపంటను సాగుచేశారు. జూన్ నెలలో వర్షాలు కురవడంతో రైతులు దుక్కులు దున్నుకొని విత్తనాలు వేశారు. నియోజకవర్గంలోని చందంపేట, దేవరకొండ, డిండి, నేరేడుగొమ్ము, చందంపేట, పీఏపల్లి, కొండమల్లేపల్లి, చింతపల్లి మండలాల్లో పత్తి విత్తనాలు...

- మిగతా 8వ పేజీలో...

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



రెండున్నర ఎకరాల్లో పత్తి సాగుచేశా. విత్తనాలు మొలకెత్తిన తరువాత సరైన వర్షాలు లేక మొక్కలు వాడుట్టాయి. ప్రస్తుతం వర్షాలు కురిసినా ఆశించిన రీతిలో మొక్కలు ఎదగడం లేదు. దీంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం వుంది. పెట్టుబడి కూడా నష్టపోయే అవకాశం వుంది. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి.

- ఎర్రానాయక్, రైతు, కల్లేపల్లి

ప్రతికూల పరిస్థితుల్లో..

ఈ వానాకాలం సీజన్‌లో పత్తి సాగు చేస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో పత్తి గింజలు నాటగానే అనావృష్టితో వర్షాలు పడక చాలా మంది రెండోసారి విత్తనాలు విత్తారు. అయినా కురకవపోవడంతో అవివాడిపోగా, మూడోసారి కూడా గింజలు నాటారు. ఆతర్వాత కురిసిన వర్షాలతో పత్తి సాగుకు అవసరమైన యూరియా కొరత పత్తి ఎదుగుదలకు ఆటంకంగా ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పెద్దగా నష్టం వాటిల్లే ప్రమా దం లేకపోయినా, మరిన్ని వర్షాలు కురిస్తే కాయలు కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

సుమారు 93వేల ఎకరాల్లో పత్తి

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా డివిజన్ పరిధిలో సుమారు 93వేల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల అంచనా. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల కంపెనీల హైబ్రీడ్ విత్తనాలను రైతులు సాగు చేశారు. ఎకరానికి సుమారు రూ.40వేల నుంచి 50 వేల పెట్టుబడి వస్తుందని, వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే దిగుబడి వస్తుందని, లేదంటే తమ పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని రైతులు భయపడుతున్నారు. పత్తి సాగులో చీడపీడలు అశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పింఛన్లు పెంచేవరకు పోరాటం ఆగదు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

నల్లగొండ టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. పింఛన్ల విషయలో ప్రభుత్వ ఇచిన హామీని నెరవెర్చాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఎస్బీఐ ఫంక్షన్ హాల్ లో జరిగిన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పింఛన్లను పెంచుతామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి పింఛన్‌దారులను మోసం చేశాడని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టి దాదాపు 20 నెలలు గడుస్తున్నా పింఛన్ పెంపు విషయం చర్చకు రాపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి పింఛన్ పెంచకుండా పింఛన్‌దారులను ద్రోహం చేస్తుంటే... ప్రతిపక్ష పార్టీలు నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవత్ రెడ్డి బంగ్లాలో పుట్టి వచ్చినాడని, కేసీఆర్ గడీల నుంచి వచ్చిన నాయకులు అయినందునే పింఛన్‌దారుల పక్షాన నిలబడడం లేదని అన్నారు. పింఛన్లు పెంచే వరకు పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. సెప్టెంబరు 3 హైదరాబాదులో జరిగే పింఛన్‌దారుల మహాగర్జనకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ నేత గడ్డం ఖాసిం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరిక శ్రీనివాస్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు లక్ష్మమ్మ, ఇంద్రచౌదరి, అహమ్మద్‌ఖాన్, సైదులు ఉన్నారు.



గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద



చందంపేట మండలం పోలేపల్లిలో గ్రంథాలయం ప్రారంభించి మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద

చందంపేట/చింతపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. చందంపేట మండలం పోలేపల్లి గ్రామ యువకులు ఒక బృందంగా ఏర్పడి నిరుపయోగంగా ఉన్న పాత గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గ్రంథాలయంగా మార్చారు. ఆదివారం ఆ గ్రంథాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ నంద మాట్లాడుతూ ఆధునిక కాలంలో యువకులు మొబైల్ ఫోన్‌లే కాకుండా, గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవాలని, గ్రంథాలయాల ద్వారా విజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రంథాలయాల ఏర్పాటు చేయాలనే ఆలోచన పోలేపల్లి యువతకు రావడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో ప్రతీ గ్రామంలో గ్రంథాలయాల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని కోరారు. గ్రంథాలయాలు అన్ని వయస్సుల వారికి ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, నాగిళ్ల జున్ను ఇద్దయ్య, కొమ్ము ప్రవీణ్, వెంకటరెడ్డి, అర్జున్‌కుమార్, కిరణ్‌కుమార్, ఉమామహేశ్వర్, రమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తూ మార్గమధ్యలో చింతపల్లిలో సాయిసన్నిధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి సాయిసన్నిధి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జడ్జీ కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం పలికారు.

పీఎస్ హెచ్ఎంల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ గౌడ్

నల్లగొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన పీఎస్ హెచ్ఎంల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హెచ్ఎంలకు రావాల్సిన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను సాధించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డి.వెంకటరత్నం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎండీ.జాన్‌ఖాన్, ప్రధానకార్యదర్శి నామని శ్రీనయ్య, కోశాధికారిగా మదర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. అనంతరం పీఎస్ హెచ్ఎంగా ఎన్నికైన వెంకటరత్నం ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పీఎస్ హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధా జయంతి

చింతపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుని సతీమణి రాధారాణి జయంతిని పురస్కరించుకొని మండలంలోని వెంకటేశ్వరనగర్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన పొద్దుటూరి దేవేందర్,లలిత దంపతులు స్వామి అమ్మవార్లకు అష్టోతర శతనామావళి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు వంగూరి శ్యాంసుందర్, పోల అశోక్, పి.రవీందర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

హాలియా, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటి సంరక్షించాలని ఏకల్ గ్రామోత్తన్ ఫౌండేషన్ ఐవీడీ ప్రెసిడెంట్ రాయప్రోలు మురళీకృష్ణశర్మ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి సంవత్సరం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు తిరుమలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేష్, వెంకటయ్య, కోటమ్మ, అమల, శంకరయ్య పాల్గొన్నారు.

డాక్టర్ రాములునాయక్‌కు కన్నీటి వీడ్కోలు

● రాములునాయక్ మృతి బాధాకరం: మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి



రాములు నాయక్ అంతిమ యాత్ర, అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

దేవరకొండ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పేదల డాక్టర్‌గా పేరుగాంచిన రిటైర్డ్ దేవరకొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములునాయక్ కు కన్నీటి వీడ్కోలు పలికారు. చందంపేట మండలం గన్నేర్లపల్లిలో ఆయన వ్యవసాయక్షేత్రంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. రాములునాయక్ మృతి వార్త తెలియగానే దేవరకొండతో పాటు పరిసర గ్రామాలు, తండాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, డాక్టర్లు ఆయన ఆసుపత్రికి చేరుకొని ఆయన మృతిపట్ల సంతాపం తెలిపి కుటుంబసభ్యులను ఓదార్చారు. తక్కువ ఫీజుతో పేదలకు వైద్యం అందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారు. వివిధ గ్రామాలు, తండాల నుంచి వచ్చిన ప్రజలు ఆయన్ను గుర్తు చేసుకొని బోరున విలపించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దేవరకొండకు చేరుకొని రాములునాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి రాములునాయక్ మృతి బాధాకరమన్నారు. రాములునాయక్ అంతిమయాత్రలో వివిధ పార్టీల నాయకులు పల్లా నర్సింహారెడ్డి, బెజవాడ శేఖర్, రమావత్ తుల్సానాయక్, కేతావత్ లాలునాయక్, గార్లపాటి జగతయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాతృనాయక్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, డాక్టర్ రవి ప్రకాష్, కృష్ణ, రవి, వివిధ పార్టీల నాయకులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పల్లెలను పట్టించుకోని ప్రత్యేకాధికారులు



వేంపాడ్‌లో సమస్యలపై సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

నిడమనూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకాధికారులు గ్రామాలను పట్టించుకోకపోవడం లేదని, దీంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను ఆరోపించారు. ప్రజా సమస్యలపై గ్రామాల్లో సీపీఎం చేస్తున్న సర్వేలో భాగంగా ఆదివారం మండలంలోని వేంపాడ్ గ్రామంలో నాయకులు పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, మురికికాల్వలు, మౌలిక వసతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రత్యేకాధికారులు విస్మరిస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, మల్లికంటి చంద్రశేఖర్, కుంచం శేఖర్, వెంపటి మహేష్, నాగరాజు, బాలరాజు, ప్రశాంత్, అంజయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసులు అన్నారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని డొక్కలబాయితండాలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన శంకర్ నేత్రాలయ డాక్టర్ల బృందం 125 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన 49 మందికి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు హైదరాబాద్‌లోని శంకర్ నేత్రాలయ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో డి.వెంకటేశ్వర్‌రెడ్డి, జార్జి శ్రీధర్, భారతీయ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, టి.శ్యాంసుంర్‌రెడ్డి, వీర య్య, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ బదిలీ

మిర్యాలగూడ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ సీఐ మోతీరాం బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో నల్లగొండ సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న నాగభూషణం నియమితులయ్యారు. కాగా ఇక్కడ పనిచేసిన సీఐ మోతీరాం హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు.

పత్తి రైతు దిగాలు



(5వ పేజీ తరువాయి)

వేశారు. కానీ విత్తనాలు మొలకెత్తే సమయానికి వర్షాలు కురవడంతో కొంత జాప్యం జరిగింది. దీంతో 5వేల ఎకరాల వరకు పత్తి విత్తనాలు ఎండే దశకు చేరాయి. తిరిగి మళ్లీ వర్షాలు కురవడంతో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. అందుకుగాను ఎకరానికి రూ.10 వేల వరకు అదనంగా ఖర్చు చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు. కాగా ఇటీవల భారీ వర్షాలు కురవడంతో పత్తిచేలకు మేలు చేకూరినట్లయింది. పత్తి చేలు ఏపుగా పెరిగాయని, ఈ సంవత్సరం పత్తి పంట బాగానే చేతికందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొదటగా జూన్‌లో 15 రోజుల పాటు వాన రాక రైతులు కొంత ఆందోళనకు గురైనప్పటికీ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కొంత ఊరట చెందారు.

నల్లగొండ నియోజకవర్గంలో..

నల్లగొండ నియోజకవర్గంలో 30,501 ఎకరాల్లో పత్తి సాగైంది. జూన్, జూలైలో సమృద్ధిగా వర్షాలు కురవకున్నప్పటికీ ఆగస్టు నెలలో కురిసిన వర్షాలతో పత్తి విస్తీర్ణం పెరిగింది. ఆలస్యంగా సాగైనప్పటికీ పత్తి దిగుబడులు బాగానే వస్తాయని రైతులు భావిస్తున్నా రు. ప్రస్తుతం పత్తి చేలు గూడ దశలో ఉన్నాయి. కనగల్ మండలంలో 7వేలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు కాగా, నల్లగొండ మండలంలో 18వేల ఎకరాలపై గా సాగైంది. ఇక తిప్పర్తి మండలంలో 5వేల ఎకరాల లోపు పత్తి సాగు చేశారు. ఇటీవల వర్షాలు అడపాదడ పా కురుస్తుండడంతో యూరియా అవసరం పెరిగింది. అయితే యూరియా కొరత తీవ్రంగా ఉండటంతో రైతులు అరకొరగా ఎరువులు వేసే పరిస్థితి నెలకొంది. పత్తి చేలు ఏపుగా పెరిగాయి. గూడదశలో ఉన్న పత్తి చేలో గూడ రాలకుండా ఉండేందుకు మందులు పిచికారీ చేస్తున్నారు. పత్తి చేలు ఆలస్యంగా సాగైనప్పటికీ దిగుబడి బాగానే వస్తుందని భావిస్తున్న రైతులు ఎరువులు సమృద్ధిగా వేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎరువుల కొరత రైతులను ఆందోళన గురిచేస్తుంది. రెండుమూడు రోజుల్లో యూరియా వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పత్తి చేలు బాగానే ఉన్నాయి



ఈ సంవత్సరం ఐదు ఎకరాల్లో పత్తిపంట సాగు చేశాను. తుఫాన్‌తోపాటు వర్షాలు కురుస్తుండడంతో పత్తిపంట బాగానే ఎదిగింది. రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టా. పంట బాగానే దిగుమతి వస్తుందని ఆశతో ఉన్నా.

- మెగావత్ సత్యం, కొత్తపల్లి, నేరేడుగొమ్ము

రెండెకరాల్లో పత్తి విత్తనాలు వేశా



నాకున్న రెండు ఎకరాలలో పత్తి సాగు చేశా. వర్షాల కారణంగా ఈ సంవత్సరం పత్తి బాగానే పెరిగింది. రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టా. దసరా, దీపావళి వరకు పంట చేతికి వస్తుందని అనుకుంటున్నా.

- వడ్త్య శక్రునాయక్, చందంపేట

రెండు, మూడు సార్లు గింజలు నాటాం

ఈ సీజన్‌లో మొదటగా నాటిన విత్తనం వర్షాలు లేక మొలకెత్తకపోవడంతో రెండు, మూడు సార్లు నాటాం. ఇప్పుడు పంటను కాపాడుకునేందుకు యూరియా కోసం తంటాలు పడుతున్నాం. ప్రభుత్వం సకాలంలో యూరియా అందజేయాలి.

- బలుసు సత్యనారాయణ, వెంకట్‌నగర్, నిడమనూరు మండలం

పరిషత్ ఎన్నికలు ఈ నెలలోనే..

(5వ పేజీ తరువాయి)

ప్రకటించినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 జడ్పీటీసీ స్థానాలతోపాటు, 766 ఎంపీటీసీ స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు, 73 ఎంపీపీ పదవులకు, మూడు జడ్పీ చైర్మన్ పదవులకు పరోక్ష ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పరిషత్‌లకు పార్టీల ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహిస్తారు. ఇందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను ఇప్పటికే సిద్ధం చేసింది.

మండలం యూనిట్‌గా రిజర్వేషన్ల ఖరారు

బీసీలకు 42శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7శాతం తోపాటు అన్ని కేటగిరీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలవుతాయి. జీవో విడుదలైన వెంటనే పంచాయతీరాజ్ కమిషనర్ ద్వారా రిజర్వేషన్ల కోటా, కేటాయింపులకు ఉత్తర్వులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే కలెక్టర్లు, ఆర్డీవోల నేతృత్వంలో రిజర్వేషన్లు ఖరారుచేసి ప్రకటిస్తారు. జిల్లా పరిషత్ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు జిల్లా యూనిట్‌గా, ఎంపీటీసీ సభ్యుల పదవులకు మండలం యూనిట్‌గా రిజర్వేషన్లు కేటాయిస్తారు. ఈ నెల 25వ తేదీలోగా ఈ పదవులన్నింటికీ రిజర్వేషన్లు ప్రకటిస్తారని, రిజర్వేషన్ల ఖరారు పూర్తయ్యాక ఎన్నికల సంఘం తొలుత పరిషత్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తుందని తెలుస్తోంది.

దివ్యాంగులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్

హాలియా, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుంటే అవకాశాలు తప్పకుండా దక్కుతాయని ఏకే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్‌కుమార్ అన్నారు. హాలియాలోని శ్లోక పాఠశాలలో ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు కంప్యూటర్, ఉపాధి కల్పన శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఏకే ఫౌండేషన్, విద్యాధన్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. విద్యాధన్ ఫౌండేషన్ చైర్మన్ పీక్టీవ్ కంపెనీ ఆపరేషన్స్ హెడ్ ఈద ర ప్రసన్న మాట్లాడుతూ ఏకే ఫౌండేషన్ ద్వారా యువత, విద్యార్థులకు అనే క కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం విద్యాధన్ ఫౌండేషన్ ద్వారా ఇంటర్న్ షిప్‌కి ఎంపికైన మడుపు మధుకి మొదటి నెల జీతాన్ని వారు అందజేశారు. కార్యక్రమంలో అమీర్ అలీ ఫౌండేషన్ చైర్మన్ అమీర్‌అలీ, ధాత్రి ట్రాన్స్‌పోర్ట్ ఎండీ నైది రవి, నాయకులు పులి శ్రీకాంత్, గంగుల అం జియాదవ్, మన్నెం కోటి, శేఖర్‌గౌడ్, గంగుల లింగస్వామియాదవ్, బొమ్మిశెట్టి రామలింగయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు



కొండమల్లేపల్లి : శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

మిర్యాలగూడ టౌన్, చింతపల్లి, కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి, మిర్యాలగూడ రూరల్, నిడమనూరు, మాడ్గులపల్లి, వేములపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పలు మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విగ్రహాల వద్ద పలువురు ప్రముఖులు పూజల్లో పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డీకాలనీలో నవయుగ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణపట్నం ఫ్యామిలీ రెస్టారెంట్ సౌజన్యంతో శ్రీవరసిద్ధి వినాయక స్వామి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 14వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భక్తుల కోసం బంగారు వినాయక విగ్రహాన్ని సిద్ధం చేశారు. లక్కీడ్రాలో గెలుపొందిన భక్తునికి బంగారు గణపతిని ఇవ్వనున్నట్లు తెలిపారు.

● చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు గణనాథుని వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. వెంకటేశ్వరనగర్ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, అర్చకుడు మొకిరాల శ్రీకాంత్‌శర్మ, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి పట్టణంలోని సాయి సిద్ధార్థ పాఠశాలలో కొలువైన విద్య గణనాథుని శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రావు, ఉపాధ్యాయులు రాజు, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద అదుర్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడి వద్ద కూన్‌రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రీతి మహా దంపతులు, పీఏపల్లి రోడ్డులో చిన్నారులు ఏర్పాటు చేసిన శంభాజీ యూత్ గణపతి మండపం వద్ద వంగాల వెంకట్‌రెడ్డి-సుచరిత దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, మంచాల బాబు, అదుర్స్ యూత్ సభ్యులు బుయ్య కోటి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అజీజ్, పల్లా నవీన్‌రెడ్డి, కోటేష్, సాయికుమార్, పున్న విజేందర్, మండలి శివ, శంభాజీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

● నిడమనూరు మండల కేంద్రంలోని రాంనగర్‌లో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విజేతలను నిమజ్జనం రోజున వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు.

● మాడ్గులపల్లి మండలంలోని చెర్వుపల్లి గ్రామంలో లోకల్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వర్షిత్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, నాయకులు సాయిరెడ్డి, మహేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నిమజ్జన ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

● సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

వేములపల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మండల కేంద్రంలోని నిమజ్జన ప్రాంతమైన సాగర్ ఎడమకాల్వ బ్రిడ్జిని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గణేష్ నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో భక్తులు నిర్వహించుకునేలా అధికారులందరూ సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో బారికేడ్లను, లైటింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, భక్తులు ఎవరూ కాల్వలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా తగినచర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమలత, ఎస్‌ఐ జి.వెంకటేశ్వర్లు, వైద్యాధికారి సుచరిత, ఆర్ఐ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, శైలజ పాల్గొన్నారు.

● వేములపల్లి మండలకేంద్రంలో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద పబ్బతి శ్రీనివాస్, చంద్రకళ దంపతులు, సల్కునూరు గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ క్లబ్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేములపల్లిలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పబ్బతి కరుణాకర్, జడ రాములుయాదవ్, శంకర్, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ముకిరాల శ్రీనివాస్, మూలగుండ్ల వేణు, నరేష్, సురేష్, శ్రీకాంత్, పృథ్వీరాజ్, వినయ్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు

● బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ దిష్టిబొమ్మల దహనం

మిర్యాలగూడటౌన్, వేములపల్లి, దేవరకొండ, చందంపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ, అతని తల్లిపై ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలను, ఫ్లెక్సీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాలు, సామాజిక పరిస్థితులపై కనీస అవగాహన లేని రాహుల్ దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీని బదనాం చేయడం తగదన్నారు దేశ సంస్కృతీ, సంప్రదాయాలను గౌరవించని కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వాన్ని వమర్శించడమే లక్ష్యంగా పెట్టుకుందని దుయ్యబట్టారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట రోజు రోజుకు దిగజారుతోందన్నారు. దేశం కోసం అహర్నిశలు శ్రమించే కొడుకును కన్న తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ ఆలోచనను మార్చుకోకపోతే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని, తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీని రాజకీయంగా ఎదుర్కొలేక మానసికంగా దెబ్బతీసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని విమర్శించారు.

● మిర్యాలగూడ పట్టణంలో బీజేపీ, అనుబంధ సంఘాల ఆ ధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చిత్రపటాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ వన్‌టౌన్ అధ్యక్షుడు బం టు గిరి మాట్లాడుతూ ఓటర్ అధికారి పేరుతో చేపట్టిన యాత్రలో రాహుల్ ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బా ధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బంటు గిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి మూల రాజిరెడ్డి, దళిత మోర్చా ఓబీసీ విభాగ జిల్లా కార్యదర్శి నాగరాజు(నంద), శివ, అజయ్ పాల్గొన్నారు.

● వేములపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు పెదమాం భరత్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ఊరేగించిన అనంతరం దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ చిర సాంబమూర్తి, నాయకులు చల్లమల్ల సీతారాంరెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, పెదమాం వెంకన్న, లవయ్య, శోభన్‌బాబు, ఉపేందర్, రాంరెడ్డి, వెంకటయ్య, మహేష్, అనిల్‌కుమార్, రమేష్‌రెడ్డి, నరేష్, శివ, కార్తీక్, మధు తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లాలునాయక్

● దేవరకొండలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ మాట్లడుతూ కాంగ్రెస్ కుట్ర రాజకీయాలను మానుకోవాలని అన్నారు. దేవరకొండలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, బెజవాడ శేఖర్, పబ్బు సైదులు, సహదేవ్, బిక్కు, శంకర్ పాల్గొన్నారు. దేవరకొండ మండలంలోని గిరిజనగర్‌తండాలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండాల అంజయ్యయాదవ్, మండల అధ్యక్షుడు నేనావత్ రామునాయక్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దశరథ్, శంకర్‌నాయక్, గణేష్‌నాయక్, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

● చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ మండల అధ్యక్షుడు గుంటోజు వినోద చారి ఆధ్వర్యంలో నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ బీహార్‌లో జరిగిన యాత్రలో నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాత్లావత్ అంజనేయులు, నేరేడుగొమ్ము మండల అధ్యక్షులు నాగిళ్ల ఆంజనేయులు, వెంకట్, శివకృష్ణ, శ్రీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



వేములపల్లి: దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న బీజేపీ నాయకులు



మిర్యాలగూడలో రాహుల్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఉద్యోగులకు ఓపీఎస్‌ను అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు పరమేష్

హాలియా, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని అమలుచేయాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ డిమాండ్ చేశారు. హాలియాలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల బతుకులు షేర్ మార్కెట్ పాలు చేసిన ఈ విధానాన్ని తక్షణమే ఎత్తివేయాలని, సీపీఎస్ విధానానికి ప్రత్యామ్నాయంగా యూపీఎస్, జీఈఎస్ భిన్నమైన విధానాలు తీసుకువస్తుందన్నారు. దీనికి పాత పింఛన్ విధానం ఒక్కటే న్యాయం చేస్తుందన్నారు. పెండింగ్ బిల్లులను కొంత చెల్లించడం హర్షణీయమని, కానీ మిగిలిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల హామీ మేరకు పెండింగ్ డీఏలు చెల్లించి పీఆర్‌సీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు గణపురం నిరంజన్, నరందాస్ దుర్గాప్రసాద్, మన్నెం వెంకటేశ్వర్లు, వెంకన్న యాదవ్, తీరందాస్ రవి, రహీం, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌పీ బలోపేతానికి కృషి చేయాలి



రాజును సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

హాలియా, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని బీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జాడి రాజు అన్నారు. ఆదివారం రాష్ట్ర కమిటీ ఆదేశం మేరకు హాలియాలో సాగర్ నియోజకవర్గ సమీక్ష సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షులు రావులపాటి రవి శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బీఎస్‌పీ పార్టీ స్థానిక ఎన్నికలలో అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని తెలియజేస్తూ, బహుజనులకు బీఎస్‌పీ పర్టీ ద్వారా మాత్రమే విముక్తి జరుగుతుందన్నారు. అంతకు ముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాడి రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జీలు శేఖర్, సోయల్, నియోజకవర్గ అధ్యక్షులు శివ, సైదులు, కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: సుందరకాండ రాఘవ: కూలీ, విట్రోస్: కూలీ, వార్-2, సుందరకాండ, దేవరకొండ : మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర : కూలీ